


పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రగిరి మాజీ ఎంఎల్‌ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు, మాజీ ఎంపిపి, వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి మోహిత్‌రెడ్డిని శనివారం సాయంత్రం తిరుపతి పోలీసులు బెంగుళూరులోని ఎలహంక వద్ద అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. ఎన్నికల అనంతరం పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈవిఎంలను భద్రపరిచారు. వీటిని పరిశీలించేందుకు వెళ్లిన ప్రస్తుత ఎంఎల్‌ఎ పులివర్తి నానిపై పలువురు దాడి చేశారు. ఈ ఘటనలో 17మందిని అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరారీలో ఉన్నారు. 307 సెక్షన్ కింద అతనిపై హత్యాయత్నం కేసు నమోదయ్యింది. బెంగుళూరులో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రశ్నించే గొంతును నొక్కేస్తాయ్..!

- 'భారతీయ న్యాయ సంహిత' చట్టాలు శాపమే
- సదస్సులో న్యాయనిపుణులు, కార్మికనేతల ఉద్ఘాటన



సదస్సులో ప్రసంగిస్తున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్‌నర్శింగరావు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'భారతీయ న్యాయ సంహిత' చట్టాలు కార్పొరేట్‌కు చుట్టాలుగా మారి ప్రశ్నించే గొంతును నొక్కేస్తాయని సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. న్యాయస్థానాలకు హక్కులను తగ్గించి, పోలీసులకు అధికారాలు కట్టబెడుతూ కొత్త చట్టాలను బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిందన్నారు. సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'భారతీయ న్యాయ సంహిత చట్టాలు వరమా..? శాపమా?' అనే అంశంపై వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రధాన ఉపన్యాసకులుగా హాజరై మాట్లాడుతూ ప్రశ్నించేవారి గొంతు నొక్కేలా, పోరాటాలను అణచివేసేలా కొత్త చట్టాలు ఉన్నాయన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసిడ్యూర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల పేర్లు స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదీనియంలను తీసుకొచ్చారని, వాటిని జూలై 1 నుంచి అమలు చేస్తున్నారన్నారు. వీటికి పేర్లు, సెక్షన్లు మార్చారే తప్ప ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏ మాత్రం తీసుకోలేదని దుయ్యబట్టారు. ఐపిసి 111 సెక్షన్ స్థానంలో కంటిన్యూ అన్లాఫుల్ యాక్టు తెచ్చారని, ఈ ప్రకారం కార్మికులకు అండగా పోరాడే వారిపై ఈ సెక్షన్ పెట్టేలా ఉందన్నారు. గతంలో ఇలాంటి కేసులు నమోదు చేయాలంటే అడిషినల్ డిజి స్థాయికి మాత్రమే అధికారం ఉండేదని, కొత్త చట్టం వల్ల సిఐ స్థాయిలోనూ అరెస్టు చేయొచ్చని, ముందస్తు సమాచారం ఇవ్వనందుకు కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టొచ్చన్నారు. కార్పొరేట్లకు కొమ్ముగాసే కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిన జూన్1 నిజమైన రాజ్యాంగ హత్య దినోత్సవం అని ఎద్దేవా చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా : గుర్రప్ప, రిటైర్డ్ జడ్జి

సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా కేంద్రం కొత్త చట్టాలు చేసింది. ఇప్పటికీ పలుకుబడి ఉంటే తప్ప పోలీసు స్టేషన్‌లో బాధితుల పక్షాన కేసు పెట్టరు. ఇక పోలీసులకు పెత్తనం ఇస్తే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

పోరాడితేనే తిప్పిగొట్టగలం : సిహెచ్ నర్శింగరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి చెందుతున్న యూరప్ దేశాల్లో మోటారు కార్మికులకు ప్రతి రెండు గంటలకు ఒకసారి అర్ధగంట విరామం ఇచ్చేలా చట్టాలు ఉన్నాయి, ఈ దేశంలో విశ్రాంతి అనేదే లేదు. శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయనడం అవివేకం. జరిమానాలు కట్టలేక యాజమానులు వాహనాలనే వదిలేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కోట్లు ఎగొట్టిన వారికి వత్తాసు పలుకుతూ కడుపుకూటి కోసం శ్రమించే వారికి కఠిన శిక్షలు వేస్తుంది. మోడి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు 11 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. కార్మికులు, సామాన్యులు చైతన్యవంతులై పోరాడితే తప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోలేం.

పోరాటాలను అణచివేసేందుకే కుమార్, ఐలు రాష్ట్ర అధ్యక్షులు

రాజ్యాంగబద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా చట్టాలు తేవడం శోచనీయం. వలసవాద చట్టాలను రద్దు చేస్తామన్న పాలకులు పోలీసుయాక్టు 30ని ఎందుకు రద్దు చేయలేదు. గతంలో ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయని పాలకులు తమ పేరు కోసం కొత్త చట్టాలను తెచ్చారు.

సుదీర్ఘ చర్చ అవసరం : హేమచంద్రారెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షులు

సందర్భాన్ని బట్టి చట్టాల సవరణ జరగాలి. కాని చట్టసవరణకు సుదీర్ఘ చర్చ జరగాలి. మెజార్టీ నిర్ణయం మేరకే సవరణ జరగాలి. ఇదేమి లేకుండా కనీసం నిమిషం సమయం కూడా చర్చ జరపకుండా ఏకంగా కొత్త చట్టాలు తీసుకురావడం దారుణం. ప్రజల కోసం సవరణలు ఉండాలే కానీ, పెత్తందారుల కోసం చట్టాలు చేయకూడదు.

చెడును వ్యతిరేకించాలి : అంబూరి సింధూజ, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పాలకులు ఎవ్వరైనా చెడును వ్యతిరేకించాలి. ప్రజలకు అన్యాయం చేసే చట్టాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి. దీన్నిపై ప్రజల్లో చైతన్యం నింపి, పోరాటాలు చేపట్టాలి.

చట్టాలు కార్పొరేట్ శక్తులకు చుట్టాలు : ఎల్.రత్నకుమార్, రాష్ట్రఉపాధ్యక్షులు, ఐఎన్‌టియుసి

చట్టాలు కార్పొరేట్ శక్తులకు చుట్టాలుగా మారాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్న వారు కోటీశ్వర్లకు కొమ్ముకాస్తున్నారు ఇది సరైనది కాదు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాటల్లో మాత్రమే భారత్ అనే పదం ఉంటుంది. చేతల్లో అందుకు భిన్నంగా ఉంటుంది. పాలనను పోలీసుల చేతుల్లో పెట్టడం దారుణం.

రాజకీయ జోక్యం తగదు : రాదాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటియుసి

దేశానికి, ప్రజలకు అవసరమయ్యే చట్టాల రూపకల్పనలో రాజకీయ జోక్యం తగదు. హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే కొత్త చట్టాలు రూపకల్పన జరిగింది. ప్రజలను దోచుకుని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే వారికి అనుకూలాగా చట్టలు ఉన్నాయి. అందరు ఐకత్యతో పోరాడితేనే ఇలాంటి వాటికి ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు.



మార్చురీ వద్ద కార్మికుని కుటుంబ సభ్యులతో అధికారులు

పైప్స్ పరిశ్రమలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పైప్స్ పరిశ్రమలో శనివారం ఉదయం పైపుల లోడింగ్ సమయంలో కాపుగున్నేరు వాస్తవ్యులు ప్రసాద్ (49) మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి ఆర్‌డిఒ రవి శంకర్‌రెడ్డి వెళ్లి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్దకు చేరుకుని మృతుని భార్య ఎం.సుమతి, పిల్లలు గౌతమ్ (16), స్నేహలత (10)లతో మాట్లాడారు. అన్ని విధాలా న్యాయం అందిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆర్డీవోతో పాటు శ్రీ కాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు కామేష్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, జగదీశ్వర్ రెడ్డి ,బత్తిరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ ఘటనపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య స్పందిస్తూ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికులు మత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీసం రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని వాపోయారు. పరిశ్రమ యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. మతుడి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



టిటిడి అదనపు ఈవో బాధ్యతలు స్వీకరణ

తిరుమల : టిటిడి అదనపు ఈవోగా సిహెచ్ వెంకయ్య చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి, ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు. సామాన్యులకు త్వరితగతిన సంతృప్తికర దర్శనం కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. సాయంత్రం వైకుంఠం క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో తనిఖీలు నిర్వహించారు.



టాస్క్‌ఫోర్స్ కూంబింగ్ వివరాలు తెలుసుకుంటూ.. (ఫైల్‌ఫొటో)

ఓన్లీ 'టాస్క్'.. నో 'ఫోర్స్'

డిఐజి స్థాయి అధికారి ఎక్కడ? ఎల్లలు దాటుతున్న ఎర్రచందనం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


ఎర్రచందనం ఎల్లలు దాటుతోంది.. ఈ ఎర్ర బంగారాన్ని పరిరక్షించి లోటుబడ్జెట్‌లో ఉన్న ఈ రాష్ట్రానికి ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఎర్రచందనాన్ని అరికట్టేందుకు 2014లో అప్పటి ప్రభుత్వం ఒక్క తిరుపతి జిల్లాకే పరిమితంకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఈ వనరును రక్షించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. ఎస్పీస్థాయి అధికారి సరిపోదని, డిఐజి స్థాయి అధికారిని నియమించాలని సంకల్పించింది. అపుడున్న ఎస్పీని బదిలీ చేసి, డిఐజి స్థాయి అధికారి అయిన కాంతారావును నాలుగేళ్ల పాటు తిరుపతిలో ఉంచింది. అప్పట్లో 150 మంది సిబ్బంది ఉంటే, డిఐజి స్థాయి ర్యాంకు పెరగడంతో మరో 150 మందిపోలీసు సిబ్బందిని పెంచి ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుంటూ వచ్చింది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉదాసీనంగా వ్యవహరించింది. నాన్‌క్యాడర్ ఎస్‌పిని నియమించి అక్రమ రవాణాపై నిర్లక్ష్యంగా ఉందన్న చర్చ నడిచింది. తగిన నిధులు, సిబ్బంది, వాహనాలు, అధునాతన టెక్నాలజీ, ఆయుధ సామాగ్రిని ఏదీ అమర్చలేదు. టాస్క్‌ఫోర్స్ అధికారులు అనేకమార్లు తమ నివేదికలను ప్రభుత్వానికి పంపినా బుట్టదాఖలే అయ్యాయి. సౌకర్యాలు ఇవ్వకపోగా, తిరుపతి జిల్లా ఎస్‌పినే ఇన్‌ఛార్జిగానూ, నాన్‌క్యాడర్ ఐపిఎస్ శ్రీనివాసులును ఎస్‌పిగా నియమించింది. ఈ ఐదేళ్ల కాలంలో లక్షల టన్నులు విదేశాలకు తరలిపోయింది. ఈ కాలంలోనే నామమాత్రపు తనిఖీలు నిర్వహించారన్న ఆరోపణలు లేకపోలేదు. అప్పటి వైసిపి ప్రభుత్వంలోనే ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు 'ఇంటి దొంగలు'గా ఉండటం వల్లనే అక్రమ రవాణాను అరికట్టలేకపోయారని, టాస్క్‌ఫోర్స్ అధికారులకు 'పవర్' లేకుండా పోయిందన్నది బహిరంగ రహస్యం. 2024 ఎన్నికల్లోనూ వైసిపి నాయకులు ఎర్రచందనంలో సంపాదించిన అక్రమ సంపాదనే ఖర్చు పెట్టారన్న ఆరోపణలను టిడిపి, జనసేన బలంగానే చేసింది. తాము అధికారంలోకి వస్తే తక్షణమే టాస్క్‌ఫోర్స్‌ను ప్రక్షాళన చేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేస్తామని చెప్పినా ఆచరణ లేకపోవడం గమనార్హం. ఇటీవల ఐఎఎస్, ఐపిఎస్‌లను బదిలీ చేశారు. అయితే టాస్క్‌ఫోర్స్‌లో ఐపిఎస్ అధికారి స్థాయి అధికారిని నియమించకపోవడంలో ఆంతర్యం ఏంటన్నది అంతుచిక్కని ప్రశ్న. లక్షల కోట్లు విలువ చేసే ఎర్రచందనం ప్రైవేట్ జేబుల్లోకి వెళుతుంటే ప్రభుత్వ ఖజానా పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్ధకమే. రాష్ట్రంలో 134 మంది ఐపిఎస్‌లు ఉండాలని, పెరిగిన జిల్లాల నేపథ్యంలో మరో 40 మంది అదనంగా ఉండాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి 40 మంది ఐపిఎస్‌లను తమ రాష్ట్రానికి బదిలీ చేయించుకునే ప్రయత్నం ఫలించింది. అయితే టాస్క్‌ఫోర్స్ బలోపేతానికి కేటాయిస్తారా, నిర్వీర్యం చేస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

మెరుగైన పాస్‌పోర్టు సేవలు : శివహర్ష



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాయలసీమ జిల్లాలకు మెరుగైన పాస్‌పోర్టు సేవలను అందిస్తున్నామని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి శివహర్ష చెప్పారు. శనివారం తిరుపతి ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలోమీడియాతో మాట్లాడారు. విజయవాడ, రాయలసీమ జిల్లాలను కవర్ చేస్తూ తిరుపతి రీజియన్‌కు పాస్‌పోర్టు సేవల డెలివరీలో గణనీయమైన మెరుగుదల ఉందన్నారు. స్ట్రీమ్‌లైన్డ్ ప్రాసెసింగ్ కోసం విజయవాడ నుంచి కేంద్రీకృత పరిపాలన దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది ఉత్తమ సేవలను అందించినందుకు ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం విజయవాడను ఉత్తమ కార్యాలయంగా అవార్డు ప్రదానం చేసిందని తెలిపారు.



తిరుపతిలో కిలాడి దంపతులు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలో కిలాడీ దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలుకు చెందిన యువతిని ప్రణవ, కిషోర్‌రెడ్డి దంపతులు ట్రాప్‌చేశారు. తిరుపతిలో లా చదువుతున్న యువతితో ప్రణవ పరిచయం చేసుకుంది. ఆ పరిచయంతో ఇంటికి తీసుకెళ్లింది. మత్తు కలిపిన పానీయాలు ఇచ్చి భర్తతో కలిసి ఉండగా ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసింది. 5 లక్షలు తీసుకున్నా వేధింపులు ఆగకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రణవ, కిషోర్‌రెడ్డిలను అరెస్టు చేశారు.



31న నికాన్ కెమెరా అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఈనెల 31న ప్రముఖ కెమెరా తయారీ సంస్థ నికాన్ నూతన వివాహ ఛాయాచిత్ర చిత్రీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి తిరుమల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మోహన్ రాజు తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో బ్రౌచర్ ను విడుదల చేశారు. తిరుపతి నగర పరిధిలోని లక్ష్మీపురం కూడలి వద్ద ఉన్న ఓ ప్రైవేటు హొటల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని జూనియర్ ఫోటోగ్రాఫర్లు, మీడియా ఫోటోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ సభ్యులు సతీష్, రాధాకష్ణ పాల్గొన్నారు.

రూ.113.17 కోట్లు పింఛన్ పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జులై మాసపు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్దిదారుల ఇంటి వద్దనే ఆగస్టు 1న ఉదయం 6 నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో 2,67,772 మంది లబ్దిదారులకు సుమారు రూ.113.17 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సాంకేతిక కారణాలతో మిగిలిపోతే రెండో తేదీ ఇస్తారన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని, పెన్షన్ లబ్దిదారులు ఎవరూ సచివాలయ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు.

'ఉపాధి'పై ఉక్కుపాదం

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజలకు ఉపాధి కల్పించడం పాలకుల బాధ్యత. కుటుంబ జీవనానికి ఉద్యోగం అవసరం. వ్యక్తుల కొనుగోలు శక్తి పెరిగి, ఆర్థిక స్వావలంబన సాధించాలంటే కనీస వేతనంతో కూడిన ఉద్యోగం తప్పనిసరి. ఓ వైపు నిత్యావసరాలతో పాటు ఏది కొనాలన్నా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు ఎక్కడేసిన గొంగళి అక్కేడ అన్న చందాగా మారింది. శ్రమదోపిడికి గురవుతున్న కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని శ్రామికులు పోరాటాలు సాగిస్తున్నారు. వీటిని పరిష్కరించకపోగా రాజకీయ వేధింపులు పెరిగాయి. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీమ్ వర్కర్లను టార్గెట్ చేసుకుని అధికారపార్టీ నాయకులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మాట వినకపోతే అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారు. చేసేది లేక అధికారులు కార్మికులను విధుల నుంచి తొలగిస్తుండడం శోచనీయం. కేవలం తిరుపతి జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు మచ్చుకు కొన్ని......

కస్తూరి కృష్ణవేణి. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని బాలయ్యపల్లి మండలానికి చెందిన సుబ్రమణ్యం గ్రామంలో ఆశావర్కరుగా గత 18 సంవత్సరాలుగా సేవలందిస్తోంది. ఈమెకు కావ్య (22), కల్యాణి (20), సుజనా (18) ముగ్గురు కుమార్తెలు, భర్త వ్యవసాయ కూలీ. కుమార్తెలు కావ్య, కల్యాణిలకు ఇద్దరు క్యాన్సర్ బారిన పడ్డారు. చర్మసంబంధిత క్యాన్సర్ కారణంగా ప్రతి నెల వారికి ఒక్కొకరికి 18వేల రూపాయలు ఇంజక్షన్లు వేయాల్సిన పరిస్థితి. క్యాన్సర్ బారిన పడిన పెద్ద కుమార్తె కావ్య నాలుగు నెలల క్రితం మృతి చెందింది. రెండో కుమార్తె కల్యాణి ప్రస్తుతం విషమ పరిస్థితుల్లో ఉంది. మూడో కుమార్తె సుజనా ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసి, డిగ్రీ చదివేందుకు సిద్దంగా ఉంది. కానీ తమ ఆర్థిక పరిస్థితి రిత్యా విద్యాసంస్థలు తెరిచి రెండు నెలలు అవుతున్నా....ఇప్పటికీ సుజనాను కళాశాలలో చేర్పించలేదు. కృష్ణవేణి పని చేస్తే తప్ప ఆ కుటుంబం ఆకలి తీరదు. ఈ నేపథ్యంలో గత 20 రోజులుగా అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు కృష్ణవేణిని ఉద్యోగం నుంచి తీసేయాలని పట్టుబట్టారు. తనను ఆదుకోవాలంటూ కనిపించన వారిందర్ని ఆమె వేడుకుంటోంది.

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎంపేడులో పి.సౌజన్య అనే అంగన్‌వాడీని తొలగించాలని టిడిపి నాయకులు పి.ఈశ్వర్‌రెడ్డి వేధిస్తున్నాడు. మన్నవరంలో గాయత్రీ అనే అంగన్‌వాడీని తొలగించాలన్న ఒత్తిడి ఉంది. నగరి నియోజకవర్గం పుత్తూరు టౌన్‌లోని భవానినగర్ సెంటర్‌లో పని చేస్తున్న లీలావతి అనే అంగన్‌వాడీ టీచర్‌ను తీసేయాల్సిందేనని ప్రయత్నం. సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం మండలంలోని పాలమంగళంలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు తంగరాజు, కుమ్మర కుప్పయ్యలను ఇప్పటికే పనిలో నిలిపేశారు. అదే నియోజకవర్గం దాసకుప్పంలో మధ్యాహ్న భోజన వర్కర్లు లీలావతి, వసంతమ్మలను ఆగిపోమ్మని వేధిస్తున్నారు. తొగరాముడి గ్రామంలో ఆశా, అంగన్‌శాడి, విఓఏ, ఫీల్డ్ అసిస్టెంట్లను తీసేయాలని టిడిపి నాయకులు వత్తిడి చేస్తున్నారు. వెంకటగిరి నియోజవర్గం వెంకటగిరి అర్బన్ పిహెచ్‌సిలో పని చేస్తున్న ఆశా వర్కర్ సాయిలక్ష్మిని తీసేయాలని టిడిపి నాయకులు ఎఎన్‌ఎంపై ఒత్తిడి తెస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంలో గడిచిన 20 రోజుల్లో 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు. తొట్టంబేడు మండలంలో 11 మందిని తొలిగిస్తామని బాధితులను, బెదిరించి, అధికార్లుపై ఒత్తిడి తెస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం మండలంలో 25 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను నిలిచిపోవాలని బెదిరిస్తున్నారు. సత్యవేడు మండలం గురుకులంలో ఇప్పిటికే బి.లీలా, పి.మల్లేశ్వరిలను ఆపేశారు. ఇలా వందలాది మంది స్కీమ్ వర్కర్లపై అధికార పార్టీ నాయకులు వేధింపులకు దిగుతూ, వారిని తొలిగిస్తుండడం శోచనీయం. రాజకీయ వేధింపులు ఉండవని ముఖ్యమంత్రి చెబుతుంటే, క్షేత్రస్థాయి పరిస్థితులు వేరే విధంగా ఉన్నాయి.

'ఆశా వర్కర్లపై వేధింపులు'పై డిఎంహెచ్‌ఒకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్న అధికార తెలుగుదేశం పార్టీ నాయకులపై కఠిన చర్యలకు చొరవ చూపాలని సిఐటియు ఆధ్వర్యంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీహరికి వినతి పత్రం సమర్పించారు. శనివారం మధ్యాహ్నం డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో డాక్టర్ శ్రీహరిని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి. బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, నేతలు మునిరాజ, ఆర్. వెంకటేష్, రాధాకష్ణ, ఎన్ డి శ్రీనివాసులతో కలిసి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో రాజకీయ వేధింపులు తారస్థాయికి చేరుకున్నాయని, స్కీం వర్కర్లను అదేపనిగా అధికార పార్టీ నేతలు జిల్లాలో పలుచోట్ల ఇబ్బందులకు గురి చేస్తున్నారని కందారపు మురళి తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిబిఎస్ మణ్యం, కందారపు మురళి



నేటినుంచి ఎపిపిఎస్‌సి డిపార్టుమెంట్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 28 నుండి ఆగస్టు 2 వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఎపిపియస్సి డిపార్ట్మెంటల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ నందు అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం రెండు సెంటర్లు ఏర్పాటు చేశారు. 3,142 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్లను లైజాన్ అధికారులుగా కేటాయించారు. ఈ సమావేశంలో ఎపిపియస్సి అధికారులు గిరిజా రాణి, యశోద పాల్గొన్నారు

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా అన్వర్ బాషా

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు ఇన్‌ఛార్జి తహశీల్దారుగా డిటి అన్వర్ బాషా నియమితులయ్యారు. ఎన్నికల విధుల్లో భాగంగా చిన్నగొట్టిగల్లు తహశీల్దారుగా నాగరాజు విధులు నిర్వహించారు. తిరిగి ఆయన బదిలీకావడంతో ఇన్‌ఛార్జి తహశీల్దారుగా డిటి అన్వర్ బాషా నియమితులయ్యారు. తహశీల్దారు నాగరాజు శనివారం రిలీవ్ కాగా ఆయనకు రెవెన్యూ సిబ్బంది, ఎంపిడిఓ సోమశేఖర్ రెడ్డి, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషి చేయాలని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అన్నారు. శనివారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఎకో క్లబ్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నాటిన కానుగ చెట్లకు ఎకో క్లబ్ కమిటీలు ఏర్పాటు చేసి వాటి పెరుగుదల బాధ్యతలు పిల్లలకు అప్పగించారు. వ్యర్థపదార్థాల, నీటి నిర్వహణ, భూమి పరిరక్షణ, శక్తి నిర్వహణ, ఆహార, గాలి నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి పిల్లలకు బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశంలో ఎకో క్లబ్ కన్వీనర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దొరవారిసత్రంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

దొరవారిసత్రం : 'మొక్కలు నాటుదాం...పర్యావరణాన్ని కాపాడుకుందాం..' అంటూ మండల పరిధిలోని చందనమూడిలో వున్న ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి పలు రకాల మొక్కలు నాటారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా ఆరవ రోజు ప్రధానోపాధ్యాయులు యం వెంకటశేషయ్య ప్రైవేటు నర్సరీలో మొక్కలు, గ్రామంలో కొన్ని మొక్కలు సేకరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచితే పర్యావరణ సమతుల్యత, పచ్చదనం కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ఆవరణ చుట్టూ వివిధ రకాల పండ్ల చెట్టు వేప కానగ వంటి 20 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ఆయమ్మ రమణమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజమ్మ, వెంకటరమణమ్మ, వెంకయ్య పాల్గొన్నారు.


చంద్రగిరిలో

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్ పాఠశాల విద్యార్థులు పచ్చని చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను ఆటపాటలతో చక్కగా వివరించారు. స్థానిక బ్లూమింగ్ బడ్ పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఆ పాఠశాల అధినేత హితేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కెజీ, యూకెజీ పిల్లలకు గ్రీన్ డే నిర్వహించారు. పచ్చని దుస్తులతో వచ్చి "పచ్చని చెట్లు వల్ల కలిగే లాభాలను ఆటపాటల రూపంలో తెలిపారు. 1వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ గురించి, చిత్రలేఖనం ద్వారా వారి భావాలను వ్యక్తపరిచారు. 6నుండి 10వ తరగతి విద్యార్థులందరు ప్రకృతి సంరక్షణకు సంబంధించిన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్కాట్స్, సెమినార్స్ లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృసి చేయాలని సీడీపీవో మెహబూబి పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'భేటీ బచావో..భేటీ పడావో'లో భాగంగా గూడూరుపట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మెహబూబీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీవో జ్యోతి కిరణ్, సూపర్ వైజర్లు చెంచులక్ష్మి పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనుపల్లి పంచాయతీలో జాతీయ కుష్టు నివారణపై అవగాహన కల్పించారు. శనివారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కుష్టు, క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని సహా అనుపల్లి పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి కుష్టు నివారణ సర్వేను పరిశీలించారు. అనంతరం కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ రాజా డీ ఎన్ఎమ్ ఓ, డాక్టర్ రమణ ఫిజియో, కిరణ్ కుమార్ డిప్యూటి డెమో, శ్రీ ప్రసాద్ రావ్ ఎమ్పిహెచ్ఇఓ, సూపర్ వైజర్లు, ఎమ్ఎల్ హెచ్పి లు, ఏఎన్ఎమ్ లు ఆశ కార్య కర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యం పనుల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పురపాలక సంస్థలో పారిశుధ్యం పనులను ఆ సంఘ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పట్టణంలోని జన సమర్థ ప్రదేశాలైన కూరగాయల మార్కెట్, అంబేద్కర్ విగ్రహ కూడలి, ప్రభుత్వాసుపత్రి, టీబి రోడ్లలో పర్యటించారు. కూరగాయల వ్యాపారులు, వాణిజ్య దారులు చెత్తను విధిగా సంబంధిత చెత్తబుట్టలో మాత్రమే వేయాలని రోడ్లపై పడేయకూడదని వారికి సూచిం చారు. మురుగునీటి కాలువలలో పూడికతీత పనులు పరిశీలించి దోమల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర, పారిశుధ్య కార్యదర్శులు, పారిశుధ్య మేస్త్రీలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి..

ప్రజాశక్తి -బాలాయపల్లి : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు ఎంతో ప్రశంసనీయమని బాలాయపల్లి ఎస్ఐ షేక్ సుభాన్ మహబూబ్ పేర్కొన్నారు. శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ జయంపు ప్రాంగణంలోని పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం నరేంద్రనాథ్ చౌదరి ,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సంస్థ సభ్యులు షేక్ ఆరీఫ్ , కొండాపురం శ్రీనివాసులు, అవుల నాగా మురళి, సభ్యులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని స్థానిక ఎంబి రోడ్డులో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పోతు గుంట విజయబాబు ఆధ్వర్యంలో శనివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పీ.జె అబ్దుల్ కలాం 9వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోఖ్రాన్ .2 అణు పరీక్ష చేయడం ద్వారా భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారని కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇ.రవినాయుడు, ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.ధనపాల్, పరమేశ్వరమంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీ నాయుడు, సూపర్ బజార్ ఛైర్మన్ చంద్ర యాదవ్, నాయకులు దాసరి విజయ్ చౌదరి, గాలి సుబ్రహ్మణ్యం నాయుడు, ఢిల్లీబాబు రెడ్డి, మధుసూదన్ రాజు , కుమార్ రెడ్డి, అజయ్ చౌదర, పరంధామ్, మణికంఠ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: డివిఇవో

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): విద్యార్థులు విద్యతో పాటు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో రాణించాలని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విశ్వనాథ నాయక్ తెలిపారు. చంద్రగిరి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లను విశ్వనాథ్ నాయక్ , కళాశాల ప్రిన్సిపాల్ జి రాజశేఖర్ రెడ్డి అందించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం పట్ల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి రాజశేఖర్ రెడ్డి డివిఇఓకు, ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థునులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, గంజాయిని అరికట్టాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బయటి వ్యక్తులు మత్తు పదార్థాలు, గంజాయి సేవించడాన్ని అరికట్టి విద్యార్థులకు భద్రత కల్పించాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం వీసీ ఆచార్య అప్పారావుకు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నేతలు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బయట వ్యక్తులు గంజాయి, డ్రగ్స్ సేవించడం ఆ ప్రభావం విద్యార్థులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్వీయూలో గత ఐదు సంవత్సరాల కాలంలో భద్రత వ్యవస్థ పూర్తిగా నాశనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల మాదిరి కాకుండా ప్రస్తుత పాలకులు విభిన్నంగా ఆలోచించి విద్యార్థులకు భద్రత, సరైన వసతి సౌకర్యాలు, ఆరోగ్య కేంద్రాన్ని ఆధునీకరించడం వంటి కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల న్యాయవిద్యను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, ఏఐఎస్ఎఫ్ చిన్న, ఎన్ఎస్‌యుఐ మల్లికార్జున, శివశంకర్ నాయక్ పాల్గొన్నారు.

దామలచెరువులో భారీ అగ్ని ప్రమాదం

- 11 మామిడికాయల మండీలు దగ్ధం
- రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలంలోని దామలచెరువు మ్యాంగో నగర్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శనివారం హఠాత్తుగా భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో 11 మామిడి కాయలు మండీలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో 80 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు పాకాల అగ్నిమాపక అధికారి గుణశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒక మామిడికాయల మండిలో అగ్ని ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. బలమైన గాలులు వీయడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి, క్షణాల్లో మంటలు మండీలన్నింటికీ వ్యాపించాయి. పాకాల, తిరుపతి , చిత్తూరు, పీలేరు ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది వచ్చి సుమారు మూడు గంటల పాటు శ్రమించి మంటలను ఆపివేశారు. ఈ అగ్ని ప్రమాదంలో 11 మామిడికాయల మండీలు మంటలలో కాలిపోవడంతో రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ఈ మంటలను అదుపు చేయడంలో తిరుపతి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సిబ్బందితో పాటు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

దామలచెరువులో భారీ అగ్ని ప్రమాదం కారణంగా 10 మండీలు ప్రమాదవశాత్తు తగలబడి భారీ ఆస్తినష్టం జరిగినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానికులతో కలసి ద్విచక్ర వాహనంపై సంఘటన స్థలానికి చేరుకుని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను విచారించాలని పాకాల పోలీసులకు తెలిపారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన వారి వివరాలు, ఎంత నష్టపోయారు ? అనే వివరాలు తెలపాలని అధికారులను కోరారు. దామలు చెరువులో జరిగిన అగ్ని ప్రమాదం లో నష్టపోయిన వారిని ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.




బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

పర్యాటక కేంద్రంగా రామగిరి

- రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఆధ్యాత్మిక క్షేత్రం రామగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పిచ్చాటూరు మండలం రామగిరి బస్టాండ్ నుండి శ్రీ వాలీశ్వర స్వామి ఆలయం వరకు రూ.60 లక్షలతో 1.2 కిలో మీటరు మేర నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇలంగోవన్ రెడ్డితో కలిసి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగిరి ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని తెలిపారు. దీనికి తోడు రేపటి నుండి ఇక్కడ వున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక తెప్పోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారన్నారు. సుమారు 30 వేల మంది భక్తులు హాజర య్యే అవకాశం వుందన్నారు. సత్యవేడు నియోజక వర్గంలోని రోడ్డు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో దాసుకుప్పం బైపాస్ రోడ్డు, టిపి కోట రోడ్డు, బుచ్చినాయుడు కండ్రిక నుండి శ్రీకాళహస్తి, సూళ్లూరు పేటకు వెళ్లే రోడ్లు వున్నాయని ఆయన తెలిపారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు వెడల్పును 150 నుండి 100 మీటర్లకు కుదించే ప్రతిపాదనను ముఖ్య మంత్రి ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నకు, ఆర్అండ్‌బి ముఖ్యకార్యదర్శి విన్నవించామన్నారు. తమ వినతు లకు ముఖ్యమంత్రి, వివిధ శాఖల ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణ కర్తవ్యంగా రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సమాన వేతనం ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో రైల్వే కాంట్రాక్టు కార్మికుల వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రైల్వే జంక్షన్‌లో రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు సెంట్రల్ కమిటీ రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు సిఐటియు నాయకులు గూడూరు రైల్వే జంక్షన్ స్టేషన్ మాస్టర్ పి వెంకటేశ్వరరావుకు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి రైల్వే స్టేషన్లో పారిశుధ్య కార్మికులు సుమారు 35 డిపార్టుమెంట్లలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా స్కిల్డ్, అన్ స్కిల్డ్, సెమీస్కిల్డ్, కేటగిరీలలో విధులు నిర్వహిస్తూ రైల్వే శాఖకు సేవలు అందిస్తున్నారని, వారి కష్టం కారణంగానే రైల్వేలకు ప్రతి ఏడాది లక్షలాది కోట్ల రూపాయలు ఆదాయం వస్తోందన్నారు. చట్టబద్ధమైన కార్మిక చట్టాలను కాంటాక్ట్ ద్వారా అమలు చేయించే బాధ్యత అసలు యజమానిగా ఉన్న రైల్వే యాజమాన్యా నిదేనని తెలిపారు. కాని రైల్వే యాజమాన్యం అమలు చేయించడంలో తగు శ్రద్ధ చూపడం లేదని తెలిపారు. తమ 31 డిమాండ్స్‌పై ఈ నెల 29 వ తేదీన రైల్వే డిఆర్ఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహి స్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంటాక్ట్ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొ ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, బివిరమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, బి చంద్రయ్య, ఎస్‌కె మున్నా, ఆసిమ్, శీను పాల్గొన్నారు.



మెరుగైన వసతులు కల్పించండి..

ఏకలవ్య గురుకుల పాఠశాల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ ఏకలవ్య గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఏకలవ్య గురుకుల పాఠశాలలో వసతులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని ఎమ్మెల్యే రుచి చూసి నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను సందర్శించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడే ఉన్న అధికారులకు, టీచర్లకు సూచించారు. పాఠశాల విద్యార్థులలో మాట్లాడి వసతుల వివరాలపై ఎమ్మెల్యే వివరాలు సేకరించారు. పేద ఎస్టీ విద్యార్థులకు మెరుగైన కార్పొరేట్ తరహా వసతులు కల్పించి మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య పాఠశాల లక్ష్యాన్ని చేరుకునే విధంగా ఉండా లని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు సమీకరిం చడం వంటి బాధ్యతను తాను తీసుకుంటానని బుచ్చినాయుడు కండ్రి మండల టిడిపి అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఐటిడీఏ అధికారి, డీఈఓ, మండల తహశీల్దారు చంద్రబాబు నాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఎంఈవో రవీంద్రనాథ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి దివాకర్, ప్రజా ప్రతినిధులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని తిరుమల రాజుల కండ్రిగ ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ కోనేటి రవిరాజు అధ్వర్యంలో తిరుపతి ఆస్టర్ నారాయణద్రి హాస్పిటల్ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ , గుండె వైద్య పరీక్షలు నిర్వహించి 170 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డి జయరామ రాజు మాట్లాడుతూ గ్రామాల ప్రజలు రోజూ నడకను అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు నయమవు తాయన్నారు. మధ్యాహ్నం వైద్య శిబిరానికి వచ్చిన వారికి భోజనం వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మం లో ఆస్టర్ నారాయ ణాద్రి హాస్పిటల్ డాక్టర్ చైతన్య , పిఆర్వో నవీన్ కుమార్, సిబ్బంది సుకన్య, ప్రత్యూష, ఉషోదయ వాకర్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్ వర్మ ,ఉప కార్యదర్శి రమేష్ రాజు , వాకర్ సభ్యులు మురళి, శివకుమార్రాజు , గ్రామస్తులు దొమ్మరాజు రఘు, సుబ్రహ్మణ్య రాజు, జయ రామరాజు, నారాయణమ్మ ,సుగుణ, తదితరులు పాల్గొన్నారు,.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పశువైద్య వర్సిటీ వీసీకి ఘన సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం నూతన ఇన్‌ఛార్జి వీసీ డాక్టర్ జెవి రమణను ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యు నాగేశ్వరరావు వర్సిటీ పరిపాలన భవనంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వెటర్నరీ యూనివర్సిటీ అభివృద్ధిలో విద్యార్థిని, విద్యార్థుల సంక్షేమం, పరిశోధనకి పెద్ద పీట వేయాలని కోరారు. పశు వైద్య పీజీ, ఇంట్రషిప్ విద్యార్థుల ఉపకార వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ రాయలసీమ అధ్యక్షుడు భార్గావ్ కుమార్, పశువైద్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాన్.ఏజరా , పార్థ సారథి,ఆదర్శ్ వినయ్, శ్యామ్, సుధీర్, చిద్విలాశ్,ధనుష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్‌కు ఇరిగేషన్ గ్రౌండ్: ఎస్ఐ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం రామగిరి సుబ్రమణ్య స్వామి ఆడికృత్తిక తెప్పోత్సవాలకు వచ్చే భక్తులకు వాహనాల పార్కింగ్ ను పిచ్చాటూరు ఇరిగేషన్ క్యాంప్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసి నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28,29,30వ తేదీలలో రామగిరి సుబ్రమణ్య స్వామి ఆలయం లో భరణి, కృత్తిక, రోహిణి తెప్పోత్స వాలు వేడుకగా జరుగు తాయని, సుమారు 30 వేల మంది భక్తులు వస్తారని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండడానికి రామగిరి బస్టాండ్ వద్ద దించి వాహనాలను పిచ్చాటూరు ఇరిగేషన్ గ్రౌండ్ వద్ద పార్కింగ్ చేయాలని ఎస్ఐ సూచించారు. గ్రౌండ్ లో క్రికెట్ క్రీడాకారులకు మూడు రోజుల పాటు అనుమతి నిరాకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆడికృత్తికకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు: డిఎం

ప్రజాశక్తి- సత్యవేడు: ఆడి కృత్తిక సందర్భంగా సత్యవేడు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆడికృత్తిక సందర్భంగా డిపో నుంచి 15 ప్రత్యేక ఆర్‌టిసి బస్సులను తమిళనాడు తిరుత్తణికి ఈ నెల 28,29,30 తేదీలలో మూడు రోజుల పాటు నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగానే తొలి రోజు జూలై 28వ తేదీ మధ్యాహ్నం నుంచి ఐదు బస్సులు, 29వ తేదీ మరో 10 బస్సులు తిరుత్తణికి నడుపుతామని ఆయన వివరించారు. సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి అర్థగంటకు ఒక బస్సు భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. సత్యవేడు నుంచి బయల్దేరి ఆర్టీసీ ప్రత్యేక బస్సు వయా రామగిరి, పిచ్చాటూరు, తమిళనాడు ఎన్ఎన్ కండ్రిక మీదుగా తిరుత్తణికి చేరుకుంటుందన్నారు. సత్యవేడు నుంచి తిరుత్తణికి రూ.95 రూపాయలు, ఊతుకోట నుంచి రూ.75, నాగలాపురం నుంచి రూ.60, పిచ్చాటూరు నుంచి రూ.50 రూపాయలు కనీస ఛార్జీలుగా నిర్ణయించినట్లు తెలిపారు. సత్యవేడు పరిసర గ్రామాల నుంచి కావడితో తిరుత్తణికి వెళ్లే భక్తులు 40 నుంచి 50 మంది ఉంటే భక్తులు ఉన్న చోటకే బస్సును పంపి తీసుకెళతామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోటేశ్వరబాబుకు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక పాత్రికేయుడు, సంఘ సేవకుడు యల్లంపాటి కోటేశ్వరబాబుకు శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూరులోని ఫార్చ్యూన్ ఐటిసి గ్రాండ్ (ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ)ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేశారు. జర్నలిజం, సామాజికంగా యల్లంపాటి కోటేశ్వరబాబు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అకాడమీ గౌరవ డాక్టరేట్ అందించారు. కోటేశ్వరబాబు కొవిడ్ వేళ మూగ జీవాలకు ఆహారాన్ని అందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు చేశారు. ఆయన సేవలకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు ఈ గౌరవడాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ వి.బాబు విజయన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేపీ మనోకరన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జె.హరిదాస్, కృష్ణగిరి సీఐ డాక్టర్ ఎస్. జ్ఞానశేఖర్. డాక్టర్‌కుమార్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని సూళ్లూరు పేట ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపీపీ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎంపీపీ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గురుకుల పాఠశాల కోసం నాలుగు సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తున్నామని దాన్ని ఇప్పించాలని కోరారు. విజయశ్రీ మాట్లాడుచూ పార్టీలకు అతీతంగా మండల ప్రజల అభివృద్ధికి అధికారులు ,ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించి ప్రజాభివృద్ధికి తోడ్పడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం లో జెడ్పిటిసి నన్ను ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, ఎంపీడీవో అన్నపూర్ణ రావ్, టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -రేణిగుంట: ఆర్‌టిసి బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. రేణిగుంట గంగమ్మ గుడి వీధికి చెందిన తిప్పయ్య (60) అజంతా మెస్ సమీపంలో భోజనం చేసి రోడ్డు దాటుతుండగా రాజంపేటకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఎడమ కాలు తీవ్రంగా దెబ్బ తగిలింది. రేణిగుంట ఎస్సై సునీల్ సంఘటన స్థలానికి చేరుకుని తిప్పయ్యను రుయా హాస్పిటల్ కు చికిత్స నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం స్టాలిన్‌ను కలిసిన నరువి హాస్పిటల్ ఎండీ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమిళనాడు వేలూరు నగరంలోని నరువి హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ జీవి సంపత్, ఆయన సతీమణి అనిత సంపత్ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను శనివారం కలిశారు. త్వరలో జరుగనున్న తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్టాలిన్ నరువి ఆస్పత్రి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సంపత్ తండ్రి, వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ యోగ క్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివాహానికి తప్పక హాజరవుతానని తెలిపారు. సీఎం స్టాలిన్ కు సంపత్ ధన్యవాదాలు తెలిపారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కురుగొండ్ల

ప్రజాశక్తి- వెంకటగిరి: ఏపి రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడులను వెలగపూడి సచివాయం మంత్రుల కార్యాలయాల్లో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం కలిశారు. వెంకటగిరి నియోజకవర్గంలోని సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. రోడ్లు గుంతల సమస్యను పరిష్కరించాలని, నియోజకవర్గంలోని రైతులకు 2014-2019 మధ్యకాలంలో రైతుపథకాలు ద్వారా ఇచ్చిన అన్ని పరికరాలను మళ్లీ రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రిని కోరారు.

రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి- రేణిగుంట: ఏపీఐఐసి రోడ్డును అధికారులు శనివారం పరిశీలించారు. రేణిగుంట పంచాయతీ పరిధిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఎమ్మార్వో ఆఫీస్ కు వెళ్లే దారిలో ఏపీఐఐసి రోడ్డు బాగు చేయాలని జన విజ్ఞాన వేదిక కోరింది. శనివారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఇంజనీర్ ఆ రోడ్డును పరిశీలించారు. గుంతల మయం అయి ఉన్న ఆ రోడ్డుని బాగు చేయాలని సిఐటియు ,జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏపీఐఐసి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ కి వినతి పత్రం అందించారు. స్పందించిన జోనల్ మేనేజర్ వెంటనే డి ఈ రాంబాబు ని పంపి సందర్శించి రోడ్డు మరమ్మతులను చేయాలని ఆదేశించారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ కెరియర్ కౌన్సిలింగ్ కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ, నంది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులపాటు విద్యార్థినులకు నిర్వహించిన సాఫ్ట్ స్కిల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎస్ హెచ్ఎం డీన్ ఆచార్య సి.వాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి కిషోరి, లక్ష్మి ప్రసాద్, భూపతి రాజు, ప్రియ, వజీహ భాను, ప్లేస్మెంట్ సెల్ మెంబర్, ట్రైనర్లు రజని, రాజ్యలక్ష్మి, సౌమ్య, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై ఎంపిడివో సమావేశం

ప్రజాశక్తి - తడ: పింఛన్ల పంపిణీపై తడ ఎంపిడిఓ యన్ విజయ కుమార్ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ ఆగస్టు 1వ తేదీ నిర్వహించనున్న పింఛను పంపిణీకి సంబంధించి తగు సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. ఆగస్టు 1వ తేదీ మొత్తం పింఛన్లు పంపిణీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



'మా ఆస్తులను స్వాధీనపరచాలి'

తిరుపతి (మంగళం) : తన కుమారుని బాగా చదివించి న్యూజిల్యాండ్‌కు పంపామని, అక్కడే స్థిరపడి గ్రానైట్ వ్యాపారం ద్వారా వచ్చిన నగదును తల్లిదండ్రుల జాయింట్ అకౌంట్‌లో వేసేవాడని తండ్రి మునస్వామినాయుడు తెలిపారు. ఆ నగదుతో పుత్తూరు తడకు గ్రామంలో మామిడితోట, రేణిగుంట మార్గంలో అపార్టుమెంట్ ఫ్లాట్, తిరుపతి కర్నాల వీధిలో 30 అంకణాల ఇల్లు కొని కిలారి మల్లీశ్వరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశామన్నారు. తాను న్యూజిల్యాండ్‌కు వెళ్లే ముందు తన భార్య పేరుతో ఖాళీ చెక్కులపై సంతకాలు చేశానని, అయితే తన చిన్న కుమార్తె సూర్యదేవర లత, భర్త లలిత ప్రభాకర్ నాగర్ దురుద్దేశ్యంతో తన భార్యకు మాయమాటలు చెప్పి తమ పేరుతో రాయించుకున్నారని విమర్శించారు. టిడిపి అధికార ప్రతినిధిగా చలామణి అవుతూ దొంగదారిన తన ఆస్తులను రాయించుకుందన్నారు. తిరిగి తన ఆస్తులను తనకు స్వాధీనపరచాలన్నారు.

కుదిరి సర్పంచ్ చెంగయ్య దుర్మరణం...

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కుదిరి గ్రామ సర్పంచ్ బొంగ చెంగయ్య శనివారం ఉదయం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ దక్షిణం సమీపములోని రైల్వే పట్టాలపై మృతదేహమై కనిపించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టు మార్టం నిమిత్తం మతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేరుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.